# బాబోయ్ గులాబీలు!

ఆ రోజు మా పెళ్లిరోజు! అప్పుడే నిద్దరలేచి కాఫీతాగుతూ, ఆ రోజు కార్యక్రమం ఏమిటీ, ఫ్రెండ్స్‌కి డిన్నర్ ఇంట్లో ఇద్దామా, ఏదైనా హొటల్ కెళదామా అని ఆలోచిస్తూ వుండగానే, మా కుటుంబ స్నేహితుడొకాయన ఆటో దిగి లోపలికొచ్చాడు.

ఒస్తూనే 'అమ్మాయ్! ఆటోవాడు చిల్లర లేదంటున్నాడు చిల్లరుంటే ఇవ్వు, మీటరు మూడు రూపాయల అరవై పైసలైంది' అన్నాడు. వెంటనే లోపలికెళ్లి చూస్తే నా దగ్గరా చిల్లర లేకపోవడంతో పది రూపాయల నోటువుంది' అన్నాను. 'ఫరవాలేదివ్వు. పది రూపాయలకి చిల్లర వాడిదగ్గరుంది. వందకి లేదట' అంటూ నా చేతిలోంచి పది రూపాయలూ తీసేసుకున్నాడు.

మీటరు డబ్బులుపోగా, ఆటోవాడిచ్చిన చిల్లరతీసి జేబులో వేసుకుని, 'అబ్బాయ్! ఇప్పుడు చెప్పరా కబుర్లు' అంటూ మావారి దగ్గర కూర్చున్నారు. నేను వెళ్ళి అతనికి కాఫీ పట్టుకొచ్చాను. 'గుడ్! నీ భార్య రత్నమయ్యా! చూడు క్షణం ఆలస్యం చెయ్యకుండా వెళ్ళి చిటికలో అమృతంలాంటి కాఫీ పట్టుకొచ్చింది' అన్నాడు కాఫీ చప్పరిస్తూ. ఈలోగా మా వారు చెప్పినట్టున్నారు. మా పెళ్లిరోజని, 'హేపీ . . . వెడ్డింగ్ . . . ( ) 'ఇప్పుడే ఒస్తా' అంటూ బయటికి నడిచాడు.

నేను కాఫీ కప్పులు లోపల పెట్టడానికి వెళ్ళి వచ్చేలోగా, ఆయనా మా వారు గేటు దగ్గర నుంచోవడం చూసి 'అరే! అప్పుడే వెళ్ళిపోతున్నారేంటీ? కనీసం బ్రేక్‌ఫాస్ట్‌చేసి వెళ్లమనండి' అన్నాను మా వారికేసి చూస్తూ.

'ఇప్పుడే వస్తాట్ట! అక్కడిదాకా వెళ్ళి ఏదో పనిచూసుకుని ఒస్తానన్నారు' అన్నారు శ్రీవారు. అతను మా మామగారికి మంచి స్నేహితుడు! గొప్ప రచయిత! అందుకని నాకు అతణ్ణి చూస్తే గౌరవం, అభిమానం.

మళ్ళీ నేనూ మా ఆయనా ఆ రోజు కార్యక్రమం చర్చించుకోవడంలో మునిగిపోయాం. కాస్సేపటికి పెద్ద పెద్ద గులాబీలు ఒక డజను తీసుకుని 'అమ్మాయ్! ఇవి నీకోసం. రోజులాగా కాదు రోజాలాగా నువ్వు నూరేళ్ళు వర్ధిల్లాలి! అంటూ ఆ పువ్వులు నా చేతిలో పెట్టాడు. నా మనస్సు సంతోషంతో గంతులువేసింది. నాకిష్టమైన గులాబీలు! తియ్యని అతని ఆశీర్వచనం! నా ఆనందం అనిర్వచనీయం! 'అంకుల్! ఈరోజు ఇక్కడే భోంచేసి వెళ్లండి' అన్నాను. నువ్వు చెప్పాలా? ఇది నా ఇల్లు. నా ఇష్టం. ఇక్కడ కాకపోతే ఎక్కడ తింటాను అంటూ వుండిపోయాడు. ఆ గులాబీలను చూసి మురిసిపోతూ వాటన్నిటినీ ఫ్లవరువాజులో సర్దిపెట్టి, మిగతా పన్లలో మునిగిపోయాను.

ఆరోజు సాయంత్రం డిన్నర్ కొచ్చిన వాళ్లంతా గులాబీలు చూసి మెచ్చుకుంటూవుంటే, అంకుల్‌కి మనసులోనే మరీ మరీ కృతజ్ఞతలు చెప్పుకున్నాను. పార్టీ అయిపోయాక ఒక్కొక్కరే వెళ్లిపోయారు.

అంకుల్ కూడా భోంచేసి వెళ్లిపోయారు.

నేనూ శ్రీవారు ఆనాటి ముచ్చట్లు చెప్పుకుంటూ వుండగా 'అంకుల్ తెచ్చిన గులాబీలు అందరికీ నచ్చాయి. నాకు మహా నచ్చాయి' అన్నాను. మావారేమీ మాట్లాడలేదు. 'మీకునచ్చలేదా? నేనిన్నిసార్లు బాగున్నాయి అంటూవుంటే మీరొక్కసారైనా బాగున్నాయనరేం?' కోపంగా చూశాను శ్రీవారి మౌనాన్ని సహించలేక.

'పాపం! ఇరవై, ఇరవై అయిదు రూపాయలు ఖర్చుపెట్టుంటాడు ఇవ్వాళ మనకోసం' అన్నాను. గులాబీల వంక చూస్తూ. అయినా మావారు మాట్లాడలేదు. నాకు తిక్కపుట్టింది. అంతేలెండి. ఆ పూలు ఇతర ప్రెజెంటేషన్ల ముందు మీ కంటికి ఆనడంలేదు. అప్పటికప్పుడు వెళ్ళి చక్కటి పూలు ఎంతో అభిమానంగా తెచ్చిన అంకుల్ మీకు నచ్చలేదు. పాపం! ఆయనకేం పట్టింది. మన పెళ్ళిరోజని తెలీగానే వెళ్లి ఆటోలో, పాతిక రూపాయలు ఖర్చుచేసి తేవడానికి?' ఈసారి గట్టిగా అంటున్న నా సీరియస్‌నెస్ చూసి, మా వారు ఫక్కున నవ్వారు. ఎందుకు నవ్వుతారు?' అన్నాను కోపంగా' మొహంపెట్టి.

గులాబీలకి ఇరవై రూపాయలు. ఆటోకి రానూపోనూ రాణీగంజ్ దాకా అయిదు రూపాయలు అంటే ఇరవై అయిదు రూపాయలు. యాభై లో పాతికపోతే, మిగిలేది పాతిక. పొద్దున్న ఆటోకి పది రూపాయలలో మూడు అరవై పోను ఆరూ నలభై అంటే ఇరవై అయిదూ ప్లస్, ఆరూ నలభై. అంటే ముఫై ఒకటి నలభై పైసలు లాభం" అన్నాడు.

ఆయన మాటలు అర్థంకాక తెల్లమొహం వేసిన నన్ను చూసి, పొద్దున్న చిల్లర లేదంటే ఆటోకి నువ్వు పది రూపాయలిచ్చావ్. అందులో ఆరూ నలభై మిగిలింది. గులాబీలు తేవడానికి నా దగ్గర యాభై రూపాయలు తీసుకున్నాడు. ఇరవై రూపాయల పూలూ, అయిదు రూపాయలు ఆటోకు పోను ఇరవై అయిదు రూపాయలు మిగుల్తాయి. అంటే ఇరవై అయిదూ ప్లస్ ఆరూ నలభై ముప్ఫై ఒకటీ నలభై పైసలూ.

ఈ రోజు ఆయన మాటలకి షాక్ కొట్టి, మాట్లాడకుండా వూరుకున్నాను. ఆ తరువాత 'పాపం! సమయానికి అతని దగ్గర డబ్బుల్లేవేమో, అందుకే అలా చేసుంటాడు' అని సర్ది చెప్పుకున్నాను.

కానీ, ఈ ప్రస్తావన మా మామగారి ముందు వచ్చినప్పుడు 'వాడు గులాబీలూ,' ప్రెజెంటేషనూ ఇది కామన్ వాడికి. అలా చాలాసార్లు మీ అత్తయ్యనీ, నన్ను టోపీవేశాడు. మననే కాదు. ఎవరిదగ్గరైనా ఇంతేవాడు' అంటూ పకపకా నవ్వేరాయన!

మతిపోయింది నాకు. బీదవాడు కాదాయన! పిల్లాపీచూలేరు. డబ్బు సరిపోక అలా చేస్తున్నాడేమో అనుకోవడానికి. కాకపోతే కులాసా పురుషుడు.

*